క్లుప్తంగా

హుస్సేన్‌కు అభినందనల వెల్లువ



హుస్సేన్‌ను అభినందిస్తున్న మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ నిర్వాహకులు

మల్కాపురం: ఇటీవల ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించిన బాక్సింగ్ చాంపియన్–2025 పోటీల్లో పారిశ్రామిక ప్రాంతానికి చెందిన షేక్ మేరీ హుస్సేన్ ఆలం ప్రతిభ చూపి కాంస్య పతకం సాధించారు. ఈ మేరకు 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద బుధవారం మైక్ టైసన్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జి రమేష్‌పాత్రుడు, కోచ్ ప్రసాద్‌పాత్రుడు (ఆర్మీ), షేక్ అలీ, ఉపేంద్ర తదితరులు పూలమాలలు వేసి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఐవోసీ గెడ్డ సమస్య పరిష్కారానికి కృషి



ఐవోసీ వద్ద గెడ్డ సమస్యపై చర్చిస్తున్న జోన్-5 జెడ్సీ రాము

మల్కాపురం: స్థానిక ఐవోసీ వద్ద గల పెద్ద గెడ్డ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జోన్–5 జెడ్సీ రాము అన్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం ఆ ప్రాంతానికి వెళ్లి గెడ్డ సమస్యను పరిశీలించారు. భారీ వర్షాలు వచ్చేటప్పుడు ఇక్కడ గెడ్డ వద్ద ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. దీంతో గెడ్డ పొంగి ఐవోసీ సేవా మార్గం ముంపునకు గురవుతుంది.దీంతో ఐవోసీకి వచ్చే ఆయిల్ లారీలు రాకపోకలు సాగించలేని పరిస్థితి కలుగుతుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జెడ్సీ అధికారులతో కలిసి ప్రణాళిక రూపొందించారు.

సచివాలయ కార్యదర్శులకు సత్కారం



కార్యదర్శులను సత్కరిస్తున్న కార్పొరేటర్ వెంకట రమేష్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డులో పని చేసి మరో వార్డుకు బదిలీ అయిన శానిటరీ కార్యదర్శులను నాగేంద్ర కాలనీ సచివాలయంలో ఆ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటరీ విభాగంలో వారు ఫిర్యాదులు లేకుండా పని చేశారన్నారు. ఉద్యోగులు బాధ్యతగా పని చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని అన్నారు. చిత్తశుద్ధితో పని చేసిన కార్యదర్శులు చంద్రరావు, శివబాబు, చిరంజీవి, కుసుమలను ఆయన శాలువా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బొడ్డేటి విజయ్, శానటరీ సూపర్‌వైజర్ ఎస్ఎస్‌వీ రమణ, సహచర సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యకళకు వీడ్కోలు.. చంద్రకళకు స్వాగతం



గ్రంథాలయాధికారులు సూర్యకళ, చంద్రకళను సత్కరిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు

పెందుర్తి: గాజువాక గ్రంథాలయానికి బదిలీపై వెళ్తున్న స్థానిక గ్రంథాలయాధికారి బి.సూర్యకళకు గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఘనంగా వీడ్కోలు పలికారు. గాజువాక నుంచి పెందుర్తికి బదిలీపై వచ్చిన గ్రంథాలయాధికారి బి.చంద్రకళకు ఘనంగా స్వాగతం పలికారు. బుధవారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఇరువురిని దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. స్థానికుడు దొడ్డి రామకృష్ణ తన కుమారుడు ధనుంజయ్ జ్ఞాపకార్థం గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందించారు. పెంటకోట శ్రీను భక్తి పుస్తకాలను వితరణ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆడారి రామకృష్ణ, పెంటకోట గణేష్, కృష్ణప్రియ, సమరసతా సేవా ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, దేముడు, రచయిత నరసింహ తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల గని.. సమస్యల ప్రతిధ్వని

- అధ్వానంగా పారిశ్రామిక వాడ రైతుబజార్
- పని చేయని డిజిటల్ బోర్డు, ఆర్వో ప్లాంట్
- అపరిశుభ్రంగా మరుగుదొడ్లు, రైతుబజార్ ఆవరణ
- ఎక్కడ పడితే అక్కడే వ్యర్థాలు
- ఇబ్బంది పడుతున్న కొనుగోలుదారులు



రైతుబజార్ ముఖద్వారం వద్ద కనిపించని నేమ్ బోర్డు

మల్కాపురం

పారిశ్రామిక ప్రాంత ప్రజలకు తక్కువ ధరకు ఆకు కూరలు, కూరగాయలు, పప్పుదినుసులు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతుబజార్‌ను పలు సమస్యలు వేధిస్తున్నాయి. దీంతో ఇక్కడికి వచ్చే కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

పెరిగిన ఆదరణ..

59వ వార్డు ములగాడ హౌసింగ్ కాలనీ, ఎంఆర్‌వో కార్యాలయం పక్కన సుమారు ఎకరం స్థలంలో 2014లో 32 స్టాళ్లతో రైతుబజార్ ఏర్పాటు చేశారు. తొలి రోజుల్లో ఇది ఊరుకి దూరంగా ఉండటంతో కొనుగోలుదారులు పెద్దగా వచ్చే వారు కాదు. కాలక్రమంలో దీనికి ఆదరణ పెరిగింది. అధిక ధరలకు బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయలేక పారిశ్రామిక ప్రాంత పరిధిలోని పలు వార్డుల ప్రజలు ఈ రైతుబజార్ వైపు ఆకర్షితులయ్యారు. దీంతో కొనుగోలుదారుల సంఖ్య పెరగటంతో నిత్యం కిటకిటలాడుతుంది.

కనిపించని ధరల పట్టిక..

రైతుబజార్‌కు వచ్చే కొనుగోలుదారులకు తెలిసేలా ధరల పట్టిక నిత్యం ఉదయం రాయవలసి ఉంటుంది. అయితే ఉదయం 10 గంటలైనా సిబ్బంది ఆ విషయం పట్టించుకోవడంలేదు. అలాగే రైతుల స్టాళ్ల వద్ద వారు అమ్మే కూరగాయలు, ఆకుకూరలు ఎంత రేటుకు విక్రయిస్తున్నారు అన్న విషయం పలకపై రాసి పెట్టాల్సి ఉన్నా అలా జరగడంలేదు. కొనుగోలుదారులు, రైతుల కోసం కేటాయించిన డిజిటల్ బోర్డు చాలా రోజుల నుండి పని చేయడం లేదు.

మరుగు దొడ్డి అధ్వానంగా మారింది. ఆర్‌వో ప్లాంట్‌లో నాలుగు ట్యాప్‌లు ఉన్నా ఒక్కటి మాత్రమే పని చేస్తుంది. అదీ చిన్నధార మాత్రమే వస్తుంది. రైతుబజార్ పరిసర ప్రాంతాలు అసౌకర్యంగా ఉన్నాయి. బురద రోడ్లు, ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి.



పని చేయని డిజిటల్ బోర్డు



ధరల పట్టిక వద్ద డంప్ చేసిన వ్యర్థాలు



ఆర్‌వో ప్లాంట్ వద్ద పని చేయని ట్యాప్‌లు

డ్రైనేజీలపై దుకాణాలు

- కూటమి నేతల నెలవారీ వసూళ్లు!
- మురుగు, వరదనీటి ప్రవాహానికి అడ్డంకి
- ఇప్పటికే పోటెత్తిన వరద నీరు
- చోద్యం చూస్తున్న అధికారులు



బుచ్చిరాజుపాలెంలో డ్రైనేజీపై ఏర్పాటు చేసిన దుకాణాలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు పరిధిలో డ్రైనేజీలను కూడా వదలడం లేదు. దుకాణాలు ఏర్పాటు చేసి మురుగు ప్రవాహానికి ఆటంకం కల్పిస్తున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా చిన్న పాటి వర్షాలకే వార్డు పరిధిలోని కాలనీల్లో డ్రైనేజీల ద్వారా దిగువకు నీరు పోయే అవకాశం లేక రోడ్లపైకి వస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు డ్రైనేజీలు పొంగి బుచ్చిరాజుపాలెంలో ఇళ్లల్లోకి సైతం మురుగునీరు వచ్చింది. బుచ్చిరాజుపాలెంలోని రేషన్‌డిపోలోకి నీరు రావడంతో బియ్యం బస్తాలు తడిసి పాడయ్యాయి. మౌనమేల రహదారులకు ఇరువైపులా డ్రైనేజీలను ఆక్రమించి వాటిపై పక్కాగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ జీవీఎంసీ అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతలకు నెలవారీ వసూళ్లకు పాల్పడుతూ డ్రైనేజీలపై కంటైనర్ దుకాణాలను దింపేస్తున్నారని ఇక్కడి ప్రజానీకం అంటున్నారు. డ్రైనేజీలపై పెట్టే కంటైనర్ దుకాణాలకు విద్యుత్ శాఖ వారు మీటర్లు సైతం మంజూరు చేస్తుండడం గమనార్హం. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ మీటర్లు అమర్చుతుండటంతో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ఏడీ టీఎల్ నుంచి సింహాచలందారిని కలిపే 80 అడుగుల రహదారిలో జరుగుతున్న ఆక్రమణలను జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రహదారికి ఇరువైపులా దుకాణాలు వెలుస్తుడడంతో వాటి ముందు వాహనాలు నిలపలేక ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయా కాలనీ వాసులు అంటున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు ఇక్కడ ఆక్రమణలపై దృష్టి సారించాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే డ్రైనేజీలు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున ఆక్రమణలను తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

ప్రమాదపుటంచున విద్యుత్ స్తంభాలు



శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభం

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు మల్కాపురం పోలీస్‌స్టేషన్ నుండి యారాడ వెళ్లే ప్రధాన మార్గంలో విద్యుత్ స్తంభాలు దారుణంగా తయారయ్యాయి. రాత్రిళ్లు వెలుగులు ఇవ్వకపోగా పూర్తిగా తుప్పు పట్టి శిథిల స్థితికి చేరుకున్నాయి. వాటి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో ఎప్పుడు కూలిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఈ మార్గంలో బస్సులు, నేవీ అధికారులు ప్రయాణించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో విద్యుత్ స్తంభాలు కూలిపోతే పెద్ద ప్రమాదమే జరుగుతుందని, దీనిని పరిగణనలోకి తీసుకుని శిథిలమైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

- డీఎస్పీ విష్ణు స్వరూప్



సదస్సులో ప్రసంగిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్

పరవాడ: డ్రగ్స్, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరవాడ డీఎస్పీ వి.విష్ణు స్వరూప్ సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు సాలాపువానిపాలెం గ్రామంలో బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇళ్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి నుంచి ఆధార్ కార్డు, గుర్తింపు కార్డులను తీసుకోవాలని సూచించారు. వారిపై ఎలాంటి అనుమానం కలిగినా, వెంటనే పోలీసులను సంప్రదించాలన్నారు. దొంగతనాలు, గంజాయి వంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల సమాచారాన్ని తెలియజేయడానికి 1972 నంబర్‌కు, సైబర్ నేరాలకు సంబంధించి 1930 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పరవాడ మాజీ ఎంపీపీ మాదంశెట్టి నీలబాబు, సాలాపు మోహనరావు, పలువురు గ్రామ పెద్దలు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉక్కు యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి



ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాల వల్ల కార్మికులు ఇబ్బంది పడుతున్నారని.. ఉత్పత్తిపై ప్రభావం పడుతుందని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ అన్నారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద యాజమాన్యం వైఖరికి నిరసరగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కార్మికులతో కనీసం చర్చించకుండా విభాగాలు మార్చడం యాజమాన్యం ఏకపక్ష నిర్ణయానికి నిదర్శనమన్నారు. మూడు నెలల్లో సుమారు రూ. 200 కోట్లు లాభాలు వచ్చినా కార్మికులకు బకాయిలు జీతాలు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. హెచ్ఆర్ఏ చెల్లింపు, కరెంటు చార్జీలు తగ్గింపు వంటి సమస్యలపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్లాంట్‌లోని ఒక్కో విభాగాన్ని ప్రైవేటు వారికి అప్పగించేందుకు అడుగులు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.వి.కె. రాజు, తాడన్న, కె. గంగాధర్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఏసీపీ బాధ్యతల స్వీకరణ

గాజువాక: సౌత్ సబ్ డివిజన్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ఏసీపీ)గా పి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాజమండ్రిలో సీఐడీ డీఎస్పీగా పని చేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు గాజువాక సీఐ పార్థసారథి, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావు తదితరులు పుష్ప గుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఈ ప్రాంతంలో పరిస్థితులపై ఏసీపీ వారిని అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలను పటిష్టంగా అమలు చేయడమే తన బాధ్యత అని పేర్కొన్నారు. పోలీస్ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు.

అప్పన్న అన్న ప్రసాద పథకానికి రూ.1.5 లక్షల విరాళం



దాతలకు బాండ్ అందజేస్తున్న ఏఈవో తిరుమలేశ్వరరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం నగరంలోని సిరిపురానికి చెందిన ఎస్‌బీఐ పెన్షనర్స్ క్లబ్ రూ.1.5 లక్షల విరాళం అందజేసింది. సింహగిరికి వచ్చిన క్లబ్ ప్రతినిధులు విరాళాన్ని నగదు రూపంలో పీఆర్‌వో కార్యాలయంలో అందజేశారు. వారికి దేవస్థానం తరపున ఏఈవో తిరుమలేశ్వరరావు బాండ్ అందజేశారు. ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందించారు.

63వ వార్డులో తాగునీరు వృథా



జయేంద్రకాలనీలో వృథాగా పోతున్న తాగునీరు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు జయేంద్రకాలనీ కొండవాలు ప్రాంతంలో గత మూడు రోజులుగా విలువైన తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. పైప్‌లైన్ పాడై తాగునీరు పోతుందని, ఫిర్యాదు చేసినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా మంచినీటి విభాగం అధికారులు స్పందించి సమస్యను చక్కదిద్దాలని కోరారు.

ఘనంగా బీఎంఎస్ వ్యవస్థాపక దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న యూనియన్ నాయకులు, ఉద్యోగులు

డాబాగార్డెన్స్: కార్మికుల పక్షాన నిలబడి, సమస్యల పరిష్కారానికి నిజాయితీగా పోరాడేది భారతీయ మజ్దూర్ సంఘ్ మాత్రమేనని ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘ్ గౌరవ అధ్యక్షుడు పైలా దేముడునాయుడు తెలిపారు. నేవల్ డాక్‌యార్డ్ విజయనగర్ గేట్ ఎదురుగా బీఎంఎస్ 70వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఐఎన్‌సీఎంఎస్ అధ్యక్షుడు పుట్టా విద్యాసాగర్, కార్యదర్శి ఎస్.రాజేష్, బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చింతాడ రమణతో కలిసి దేముడునాయుడు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సంక్షేమంతో పాటు వారి న్యాయమైన హక్కుల సాధన, కార్మికుల్లో దేశభక్తిని నింపేందుకు, తాము పని చేసే పరిశ్రమల పురోభివృద్ధే పరమావధిగా బీఎంఎస్ పని చేస్తుందన్నారు. యాజమాన్యాల్ని బెదిరించి పరిశ్రమలు ఖాయిలా పడేలా అనైతిక సమ్మెకు దిగే విధానాన్ని బీఎంఎస్ వ్యతిరేకిస్తుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సత్యానందం, బి.సత్య శ్రీనివాస్, కె.వెంకట్‌నాయుడు, పంపా రవి కుమార్, పి.సురేష్, పెదపాటి రాజు, అల్లిపల్లి నరసింహరాజు, ఆడారి రమేష్, రావత్, గొన్నా మహేష్, అశోక్‌కుమార్, మళ్ల మోహనరావు, కె.వెంకటేశ్వరరావు, సాహూ, మెటీరియల్ ఆర్గనైజేషన్ నాయకులు శ్రీనుబాబు, సంపత్, శేషు, రామకృష్ణ, వర్క్స్ కమిటీ సభ్యులు ముత్తిరెడ్డి శ్రీనివాస్, జగదీష్, యోగిత, బి.లక్ష్మణరావు, బండారు శివ, కాసుబాబు, సంఘ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దల సూచనలు పాటించాలి



వృద్ధులకు జ్ఞాపికలు అందిస్తున్న పాఠశాల యాజమాన్యం

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు ఆర్‌కేపురంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బుధవారం గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఇంట్లో పెద్దలు, వృద్ధులు చెప్పే సూచనలు చిన్నారులు పాటించాలన్నారు. ఎన్నో ఇబ్బందులను అధిగమించి నేడు ఈ స్థాయికి చేరిన పెద్దల పట్ల చిన్నారులు గౌరవంగా మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారులు వేదికపై చేసిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు పాఠశాల యాజమాన్యం జ్ఞాపికలు అందించారు.

ఈ దారిలో వెళ్లేదెలా?



రహదారిపై పెట్టిన ప్రచార బోర్డులు

విశాఖ విద్య: ఎన్ఏడీ సెంటర్‌లోని కొన్ని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల ప్రచార పోకడలు ప్రజానీకానికి ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఎన్ఏడీ బీఆర్‌టీఎస్ రోడ్డు నుంచి ఇందిరాప్రియదర్శిని కాలనీ, భరత్‌నగర్‌లకు వెళ్లే దారిలో కొన్ని కాలేజీల నిర్వాహకులు అడ్డంగా ప్రచార బోర్డులు పెట్టారు. ఈ దారిలో రెండు కాలేజీలు, మరో కార్పొరేట్ స్కూల్ ఉన్నాయి. వీటికి సంబంధించిన వాహనాలు సైతం రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండడంతో ఆ దారిలో రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అయినా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి రహదారిపై ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నారు.

డిజిటల్ నగదు లావాదేవీలపై అవగాహన



సబ్బవరం కళాశాలలో బ్రోచర్ ఆవిష్కరిస్తున్న బ్యాంకు సిబ్బంది, అధ్యాపకులు

సబ్బవరం: డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత లావాదేవీలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండటంతో పాటు ఆచరించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సబ్బవరం బ్రాంచ్ మేనేజర్ డి.రాజేష్ సూచించారు. ఆర్‌బీఐ ఆదేశాల మేరకు బుధవారం సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి బ్యాంకింగ్ సేవలపై అవగాహన అవసరమన్నారు. నగదు రహిత లావాదేవీలు వినియోగించేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ విధిగా బ్యాంకింగ్ పోర్టల్‌లో చేరాలని, ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకు ఉత్పత్తులను ఉపయోగించుకుంటూ బ్యాంకింగ్ సేవలను తెలివిగా వినియోగించుకోవాలన్నారు. డిపాజిటర్ అభద్రత తొలిగింపు, బ్యాంకు వైపు మొదటి అడుగు, డిపాజిటర్‌లకు బ్యాంకు ఖాతాలు తెరవడం, లావాదేవీలు నిర్వహించడంపై అవగాహన కల్పించారు. ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, దేశంలో చెల్లింపులు, వయో వృద్ధులకు బ్యాంకింగ్ సౌకర్యం, రిజర్వ్ బ్యాంక్ ఇటీవల కల్పించిన సదుపాయాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్, ఎస్‌బీఐ మేనేజర్ డి.రాజశేఖర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.ఆంజినేయులు, ప్రాజెక్ట్ మేనేజర్ వి.అశోక్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు ఎస్.హరి, ఎస్.బాలకృష్ణ, ట్రైనర్లు ఎన్.గణేష్, కె.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీ సెహగల్‌కు ఘన నివాళి



కెప్టెన్ లక్ష్మీ సెహగల్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఐద్వా సభ్యులు

పరవాడ: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో కెప్టెన్ లక్ష్మీ సెహగల్ 12వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక టిడ్కో కాలనీలో బుధవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా మహిళా మండల శాఖ అధ్యక్షురాలు మన్యాల బంగారమ్మ మాట్లాడుతూ చిన్నతనంలోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మద్య నిషేధం వంటి జాతీయ పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు అయిన సెహగల్ భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళగా నిలిచారని గుర్తు చేశారు. సింగపూర్‌లో భారతీయ నిరుపేదల కోసం వైద్యశాలను స్థాపించి భారతీయ నిరుపేదలు, కార్మికులకు ఉచితంగా వైద్య సేవలందించారన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ ప్రసంగాలకు ప్రభావితురాలై స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరి కెప్టెన్ హోదా పొందారన్నారు. 2002లో వామపక్షాల మద్దతుతో రాష్ట్రపతి పదవికి పోటీచేశారని తెలిపారు. త్యాగం, ధైర్యం, దేశభక్తి లక్ష్మీ సెహగల్ సొంతమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి తుంపాల అన్నపూర్ణ, మంగమ్మ, లక్ష్మి, సరోజిని, అరుణ, వరలక్ష్మి, అబద్దం, గోపాలరావు పాల్గొన్నారు.